# వింత మనస్సు

★ సులోచన ★

శివరామయ్య ఆస్తే వున్నవాడూ కాదు, బొత్తిగా లేనివాడూ కాదు అతని స్థితి ఎలాగున్నప్పటికీ అది మనకు అనవసరం, మనకుకావల్సింది అతని మనస్తత్వం మాత్రమే. ఆమనస్తత్వం అతన్ని ఒకవిధంగా బాధపెట్టలేదు.
లేనివాళ్ళకీ యాచించినవాళ్ళకీ అతను దమ్మిడీ దానంగానూ; చందాగానూ యివ్వలేదు, పిల్లలు లేరు, భార్య ఈమధ్యనే చనిపోయింది. అతను రెండోపెళ్లికి సిద్ధపడుతున్నాడు అనేదాంట్లో నమ్మకం ఎవ్వరికీ చిక్కలేదు, ఎవ్వరితో చేసుకుంటానని చెప్పలేదు,

ఇంతకీ మనం చూడవల్సింది అతని మనస్తత్వాన్నిగురించి. లోకంలో అనేక రకాలైన మనుష్యులు వుంటారు వాళ్ళు భిన్నభిన్న అభిప్రాయాలను ఆశయాలను అనుభవాలను కలిగి వుంటారనేది నిర్మలసత్యం కాకపోదనికాదు కాని ఆ అనుభూతులన్నీ కేవలం దేనిమీద ఆధారపడి వుంటవి అనే ప్రశ్నే గనుక మనం వేసుకొంటే అవి పూర్తిగా మనస్తత్వాల మీదనే ఆధారపడి వుంటవని తేలిగ్గా సమాధాన పడొచ్చు. ఎటొచ్చీ ఈ మనస్తత్వాల వల్ల కొన్నిజీవితాలు తేనెసోనగా నడిచి పోతవి. మరికొన్ని జీవితాలు కష్టసమన్వయ దుష్ట సమస్యలతో సంకీర్ణమౌతవి.

చిన్నప్పుడు గోలీకాయ లాడేప్పుడు ఆటలో ఒక గోలీకాయి కనపడకుండాపోతే ఆ పోయిన వైపుకు మరోగోలీకాయ విసరేవాడు. దొరికితే అదృష్టవశాత్తు కానీయండి మరేవిధంగానైనా కానీయండి దొరికితే రెండూ దొరికేవి, లేకపోతే రెండూ దొరికేవికావు. కాని, దొరికినా దొరక్కపోయినా ఏవిధమైన విచారానికిగానీ, సంతోషానికిగాని గుర్తైయ్యేవాడు కాదు.

ఆ మనస్తత్వంతోటి జీవితాన్ని నెట్టుకు రావటంచాత అతని ఆస్తి క్రమంగా క్షీణిస్తూవచ్చింది మరీ చిత్ర మేమిటంటే ఒక చెంపన ఆస్తి కరిగిపోతున్నా చట్టిలో వెన్నపూస కరిగినట్టు గమనించేవాడు కాదు,

పిత్రార్జితంలో పంచుకొన్నది పదెకరాలు. ఇప్పుడున్నది రెండెకరాల నలభై సెంట్లుమాగాణి. ఇంతపాటి ఆస్తి ఎలా క్షీణించి పోయిందని ఎవరన్నా అడిగితే శివరామయ్య నిజానికి చెప్పేదేమీ వుండదు. కర్మ, విధి - మీద ఆయనకు నమ్మకం ఏమాత్రమూ లేదు గనుక - తనే తనకు తెలీకండా ఖర్చుపెట్టేస్తున్నాడని సంతృప్తిపడేవాడు, అతను పెట్టే ఖర్చుకు కారణాలు అవసరంలేదు, అవసరాలు అవసరంలేదు ఇలాగ ఖర్చుపెట్టే వాళ్ళని మనం పిచ్చిఖర్చు మనుషులని అంటాము కూడా !

ఎవరన్నా అడిగిన వాడికి అప్పు వెంటనే అడగంగానే యిస్తాడు వాడు ఆ అప్పు అడగటానికి బిడియపడక్కర్లేదు. అధికంగా పడుతూన్న కష్టాల్ని వివరించుకో నవసరంలేదు. వెంటనే యిస్తాడు, ఈ ఇవ్వటంలో అతను అనుసరిస్తూన్న గొప్పవక్రమార్గం ఏమిటంటే ఇతను అడగ్గానే తను అప్పు యిస్తున్నాడు వాడు ఎలాటివాడైందీ తిరిగీ యిచ్చేవాడా యివ్వనివాడా అని తెలుసుకోకుండానే యిస్తున్నాడు. 'వాడు

యివ్వకపోతే?' అనే ప్రశ్న రాకపోవటమే! అర్ధమైనవాళ్ళకీ అప్పులు యివ్వటమే!

ఆ అప్పులు పుచ్చుకొన్న వాళ్ళలో చాలా మంది తిరిగి యివ్వరని అనటందేనికి కాని, ఆ యివ్వటం త్వరగా యివ్వరు. అలా ఆలస్యం చేస్తూంటే ఆ అప్పునుతీసుకోవాలని శివరామయ్య పెట్టే ఖర్చు సామాన్యంగా అప్పును మించి పోతూంటుంది. అక్కడే అతనుతినే గొప్పదెబ్బ. ఎన్నిరూపాయలన్నా ఖర్చుపెట్టనివ్వు ఆ అప్పు తీసుకరావాల్సిందే. ఈ మనస్తత్వం అతని గొప్ప పట్టుదలని వ్యక్తీకరిస్తుంది,

పెద్దమనుష్యులని అనుకొన్నవాళ్ళల్లో వ్యవహరింపబడే వాళ్ళల్లో సహజంగ వుండే చెడు అలవాట్లు సహితం అతనిలోలేవు. ఒకళ్ళని అనవసరంగా కాకపోయినప్పటికీ అవసరంగానైనా త్వరపడి దూషించడు.

అతను ఈమధ్య నాతోకసపడి అన్నాడు.

'లోకంలో వింతవింత మనుష్యులుంటారు. వాళ్ళవింతల అంతర్యాలను తెలుసుకోవాలంటే కొంతడబ్బు ఖర్చుపెట్టుకోవటం అవసరం' అని.

'అందువల్ల మనకువచ్చే లాభమేమిటీ? వృధాగ డబ్బు ఖర్చు కావడంతప్ప' అన్నాను.

శివరామయ్య మాట్లాడలేదు.

నేనన్నాను 'నేను గుంటూరులో బి ఏ. చదువుతూన్నప్పుడు నా స్నేహితురాలొకతె ఉండేది. ఆమె ఇలాగే పిచ్చిఖర్చు పెడుతూండేది'

'ఉహు' అని వూరుకున్నాడు.

కొంచంసేపు వూరుకొని తరువాత ఇలా అన్నాడు—

"మొన్న నాకొక అనుభవం జరిగింది. ఇంకా జరుగుతూనే వున్నది. పర్యవసానం ఏమవుతూందీ నాకుతెలియదు. ఆఅనుభవం చెబుతాను విను" అని చెప్పటం ఆరంభించాడు.

"పదిరోజుల క్రితం తెనాల్లో ఎవరో నాకు డబ్బు ఇవ్వాల్సుంటే, ఆడబ్బుకోసం తిరుగుతూ ఒకరోజు రైలుదిగి వాడిఇంటికి వెళుతున్నాను. ఎవరో నాకు పదిగజాల దూరంలో, రోడ్డుప్రక్కన చెట్టుక్రింద రిక్షామీద ఒకఆడమనిషి కూర్చొని వుంది. చుట్టూ జనం మూగాదు, ఆ ఆడమనిషి ఎర్రగా వుంటుంది. పిచ్చిదిగానాకు తోచింది. జుట్టు విరబోసుకుని వున్నది. చీరబాగా మాసి వున్నది. జానెడు చుట్ట నోట్లోవున్నది. చూడటానికి అసహ్యంగా వుంటుంది, ఎందుకు అంతమంది ఆమెచుట్టూ గూడారు, ఆమెలో ఏంప్రత్యేకత ఉన్నది అనే ఆలోచనతో ఆమెవంకే ఆజనం వంకే చూస్తో వెళుతున్నాను"

"సరీగ్గా ఆమె ఎదురూకి రాగానే చేయి ఎత్తి పిలచింది. ఆజనమంతా నావంక తిరిగారు, నాకు భయమే కాకుండా ఆశ్చర్యం వేసింది. వెళ్లాను, దగ్గరకు.

"నా జేబును గట్టిగాపట్టుకొని నవ్వుతూ జేబులోవున్న యాభై రూపాయలు బయటికి తీసింది. నేను విచిత్రచూపులు చూశాను. ఇక వెళ్ళమన్నట్టు చూసింది. కొంచెంసేపు వూరుకొని, "డబ్బు ఇవ్వు అవసరమైన పనిమీద వెళుతున్నాను" అన్నాను, 'నాక్కావాలి' అన్నది దేనికని అనటానికి నాకుభయం వేసినమాట నిజమేకాని, అలా అనకుండా "డబ్బుఇవ్వాల్సిందే!" అని గట్టిగా అన్నాను. 'అలాగైతే యివ్వాలేదు' అని మరీగట్టిగా అరిచింది

"ఇది యింతేలే మిష్టర్ ఆశ వదులుకొని వెళ్లు" అన్నాడు, నాప్రక్క నవున్న పంగనామాలతను,

నాకు పట్టుదల హెచ్చింది. డబ్బు యిచ్చేదాకా కదలనని బిగించుకు కూర్చొన్నాను. అరగంటసేపు వున్నా యిచ్చేటట్టు కనపళ్లేదు.

చివరకు అన్నది. "రేపు మాయింటికిరా ఇస్తాను" అన్నది.

ఇక అలాగేనని తృప్తిపడి ఆవేళటికి యింటికి వెళ్లాను, మరునాడు రెండు రూపాయలు

ఖర్చుపడి, రిక్షావాడిచేతిలో అర్ధరూపాయ పెట్టితే వాడు వూరు వూరంతా తిప్పకొచ్చి దానియింటి దగ్గర వొదిలి పెట్టాడు. చిన్నతోటలో వుంది, పూరిగుడిసె. గుడిసెలోకి తీసుక వెళ్ళింది ఏమీలేదు. ఏదో మట్టిబొమ్మ, పూజట. కాస్త పసుపూ కుంకుమ వున్నది.

"డబ్బు ఇవ్వమన్నాను"

"వచ్చే శుక్రవారంనాడు యిస్తాను'' అన్నది.

"నాకు భలేకోపం వేసింది. కాని ఏమనాలి? ఏంచేయాలి?" అన్న ప్రశ్నలు అడ్డువొచ్చి నాకోపాన్ని అణిచి వేశాయి.

"సరే శుక్రవారంనాడు వెళ్లాను. మళ్ళావొచ్చే శనివారం నాటికి వాయిదా వేసింది."

"ఇలా నాలుగు, అయిదు వారాల్నుంచి తిరుగుతున్నాను, ఇంకా వాయిదాలు వేస్తూనే యున్నది."

"ఈలోపల నాకు ఆమెను గురించి నాకుతెలిసిన వివరా లేమిటంటే; ఆమెది, ఏవూరో పల్లెటూరని. ఉప్పరజాతికి చెందినదని. ఇలా గుంటూరు, తెనాలి, బెజవాడల్లో తిరుగుతుంటూ వుంటుందట."

"ఎవరిజేబులో ఎంతడబ్బు వున్నదీ, చెబుతూందట, వెనక ఎవరో ఒకడ్ని పిలిచి "నీజేబులో ఏడువందల యాభై రూపాయల, ముప్పావలా అర్ధణావున్నది, బయటికి తియ్యమన్నదట" ఆశ్చర్యం సరిగ్గావాడిజేబులో అంతే వున్నదట. ఆడబ్బు లన్నీతీసుకొని కొంచెంసేపు యేడిపించి పదిరూపాయలు తీసుకొని మిగిలినవి ఇచ్చిపంపిందట. మరొకడ్ని పిలచి వాణ్ణి వేలున వుంగరం లేకపోవటం చూసి, "ఉంగరం ఏవుంపుడు గత్తెకుఇచ్చావు" అన్నదట. క్రితంరోజునే భోగందానికిచ్చాడట, ఆదిలాసా పురుషుడు."

'ఇటువంటివే కొన్ని జరిగినవని అంటున్నారు కాని ఆమనిషి ప్రజల్ని మోసంచేసి డబ్బు లాగుతుందని నాఅనుమానం ఆమెదగ్గర శాపాలు, శక్తివున్నదని చాలమందికి గాఢనమ్మకమట. "నీగతి చూచుకో ఏమవుతుందో అని అంటుందట తనకు అలిమికాని వాడితో - అంతటితో వాడు దడచి చస్తాడట."

నేను కొంచెంసేపు నవ్వి "ఇంకా ఎన్నిసార్లు తిరగ దలుచుకోని, ఎన్నిరూపాయలు ఖర్చుపెట్ట దలచు కున్నావు?" అన్నాను.

శివరామయ్య మాట్లాడలేదు. కాని యాభై రూపాయలు వరకు ఖర్చు పెట్టేట్టే వున్నాడు.

